క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

మేడిపల్లి: మేడిపల్లిలోని ప్రధాన రహదారి శ్రీసాయి హాస్పిటల్ నుంచి అపెక్స్ మెయిన్ రోడ్డులో విద్యుత్ మరమ్మతుల కారణంగా బుధవారం 11కేవీ మేడిపల్లి ఫీడర్ పరిధిలో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు విద్యుత్ అధికారులు తెలిపారు. వినాయక్‌నగర్ ఓంవిహార్ కాలనీ, భరత్‌పురి కాలనీ, మారుతీ నగర్ తదితర ప్రాంతాల్లో కరెంటు ఉండదని ఏఈ ప్రదీప్‌కుమార్ తెలిపారు.

జీఆర్‌రెడ్డి నగర్ వెల్ఫేర్ నూతన కమిటీ

కాప్రా: జీఆర్‌రెడ్డి నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. అధ్యక్షుడిగా డి.సాంబశివరెడ్డి, ఉపాధ్యక్షులుగా ఆర్.భిక్షపతిరెడ్డి, సీహెచ్.అనంతచారి, ప్రధాన కార్యదర్శిగా జగన్‌మోహన్‌రావు, సంయుక్త కార్యదర్శిగా నాగేశ్వర్‌రావు, వెంకట రాములు, కల్చరల్ సెక్రటరీగా కెవీఎస్ఎల్ నర్సింహరావు, కోశాధికారిగా వర్ధిరెడ్డిని ఎన్నుకున్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు నాటాలి



రామంతాపూర్: శ్రీచైతన్య స్కూల్‌లో మంగళవారం స్మార్ట్ లివింగ్ ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులను భాగస్వామ్యం చేస్తూ మొక్కలతో ర్యాలీ నిర్వహించిన అనంతరం స్కూల్ ఆవరణలో మొక్కలు నాటించారు. ఈ సందర్భంగా స్కూల్ జీఎం సతీష్ మాట్లాడుతూ పచ్చని చెట్లతో వాతావరణ సమతుల్యతతో పాటు ప్రాణవాయువు పెరుగుతుందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. కార్యక్రమంలో స్కూల్ డీన్స్ పుల్లారావు, రాజేంద్రప్రసాద్, ప్రిన్సిపాల్ భాగ్యలక్ష్మి, నాగరాజు, శైలజ, రాజేశ్వరి, కనకారావు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను చేపట్టండి



హబ్సిగూడ డివిజన్ పరిధిలో పర్యటిస్తున్న కార్పొరేటర్ చేతన

హబ్సిగూడ: వెంకట్‌రెడ్డినగర్, వాసవినగర్, శ్రీనివాసపురం, గణేష్‌నగర్‌లో కార్పొరేటర్ కక్కిరేని చేతనహరీష్ అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. డివిజన్ పరిధిలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాలనీలో డ్రైనేజీలకు మరమ్మతులు, తాగునీరు కలుషితం అవుతున్న ప్రదేశాల్లో నూతన లైన్లు వేయాలని, నూతన రోడ్లు వేయాలని సూచించారు. కార్యక్రమంలో జలమండలి డీజీఎం రజనీకాంత్, ఏఈ రవీందర్, డీఈ నాగమణి, ఏఈ సాయికిరణ్, స్థానికులు యాదయ్య, శంకరయ్య, హన్మంతరావు, శంకర్, మల్లేష్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, అబ్దుల్, జావేద్, శ్రీనివాస్, శశిధర్, చెల్లోజు ఎల్లాచారి, శివగౌడ్ పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించాలి



జోనల్ కమిషనర్‌తో కార్పొరేటర్ సునీత

మౌలాలి: సికింద్రాబాద్ జోనల్ కమిషనర్ రవి కుమార్‌ను మంగళవారం మౌలాలి కార్పొరేటర్ గున్నాల సునీతశేఖర్‌యాదవ్ మర్యాదపూర్వకంగా కలిశారు. అదేవిధంగా డివిజన్ పరిధిలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆమె కమిషనర్‌ను కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు ఉన్నారు.

విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకు తొలిమెట్టు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ఒకటి నుంచి 5వ తరగతుల వరకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు బుధవారం నుంచి 8వ తేదీ వరకు మండలస్థాయిలో శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. మంగళవారం మేడ్చల్ కలెక్టరేట్‌లో విద్యార్థుల కోసం తయారు చేసిన వర్క్ బుక్కులు, ఉపాధ్యాయుల కోసం రూపొందించిన హ్యాండ్ బుక్స్‌ను ఉపాధ్యాయులకు ఆమె అందజేశారు. ఈ వర్క్ బుక్స్‌ను ప్రతి విద్యార్థికి అందజేసి వాటిని ఏ విధంగా పాఠశాలలో ఉపయోగించాలో తెలపాలని డీఈఓ విజయకుమారి పేర్కొన్నారు. జిల్లాలోని 15 మండల కేంద్రాల్లో తెలుగు, గణితం, ఆంగ్లం సబ్జెక్టులపై రెండు రోజుల చొప్పున శిక్షణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. విద్యార్థుల్లో సామర్థ్యాలను పెంచేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు.

పెంచుట.. నరుకుట కోసమేనా..?

హరిత హారానికి రూ.కోట్ల ప్రజాధనం



కేశవనగర్ రోడ్డు పక్కన దుర్వాసన వెదజల్లుతున్న చెట్ల కొమ్మలు

- విద్యుత్ స్తంభాల కిందే మొక్కల పెంపకం
- కరెంటు వైర్లకు అడ్డొస్తున్నాయని నరికేస్తూ..
- నరికిన కొమ్మలు తొలగించడంలో నిర్లక్ష్యం
- వర్షాలకు కుళ్లిపోయి దుర్వాసనతో ఇబ్బంది

బోడుప్పల్: బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలో హరిత హారం కింద మొక్కలు నాటేందుకు ప్రతి సంవత్సరం కోట్ల రూపాయల ప్రజాధనాన్ని వెచ్చిస్తోంది. హరిత హారం కింద నాటిన మొక్కలకు సరైన ఆలనా పాలనా లేక కొన్ని మొక్కలు చనిపోతున్నాయి. విద్యుత్ స్తంభాల కింద నాటిన కొన్ని మొక్కలు ఏపుగా పెరగడంతో విద్యుత్ వైర్లను తాకుతున్నాయి. వైర్లకు అడ్డొస్తున్న చెట్ల కొమ్మలను విద్యుత్ అధికారులు ఇష్టారాజ్యంగా నరికేస్తున్నారు. అంతేగాకుండా నరికేసిన కొమ్మలను అక్కడ నుంచి తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రోడ్డు పక్కన వేసిన కొమ్మలతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదే విషయమై అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

హరితహారం కోసం అధిక ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం హరిత హారం కోసం అధిక ప్రాధాన్యం ఇస్తోంది. ఈ క్రమంలో బోడుప్పల్‌లో మొక్కలు నాటి హరిత వనంగా మార్చేందుకు అధికారులు, పాలకవర్గం కృషి చేస్తున్నారు. నగర పాలక సంస్థ వార్షిక బడ్జెట్‌లో ప్రతి సంవత్సరం హరితహారం కోసం 11 శాతం నిధులు కేటాయిస్తున్నారు. గడిచిన నాలుగేళ్లలో బోడుప్పల్‌లో రూ.20 కోట్లకు పైగా నిధులు కేటాయించి హరితహారం పనులు చేపట్టారు. ప్రతి సంవత్సరం జూన్, జులై మాసంలో హరిత హారంలో భాగంగా మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు అధికారులు, పాలక వర్గం కృషి చేస్తోంది.

విద్యుత్ వైర్ల కిందనే మొక్కలు

బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని కాలనీల్లో ఉన్న రోడ్లకు ఒక వైపు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు చేపడుతుండగా, మరో వైపు విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేస్తున్నారు. మున్సిపల్ అధికారులు, పాలకవర్గం ప్రతి సంవత్సరం హరిత హారంలో భాగంగా మొక్కలను ఖాళీ స్థలాలు, పార్కులు, వైకుంఠధామాలు, రోడ్లకు ఇరువైపులా నాటుతున్నారు. విద్యుత్ స్తంభాల కింద నాటిన మొక్కలు ఏపుగా పెరిగి అవి విద్యుత్ వైర్లకు తగులుతున్నాయి. వర్షాకాలం, వేసవి కాలంలో చెట్ల కొమ్మలు విద్యుత్ తీగలకు తగిలి అంతరాయం ఏర్పడుతోంది.

ఫీడర్ పరిధిలో ట్రీ కటింగ్‌కు రూ.20 వేలు

ప్రతి సంవత్సరం ఒక్కో ఫీడర్ పరిధిలో రెండుసార్లు ట్రీ కటింగ్ పనులు చేపట్టాల్సి ఉంది. అందుకోసం ప్రభుత్వం ట్రీ కటింగ్ కోసం రూ.20 వేలు ఖర్చు చేస్తోంది. వేసవిలో ఒకసారి ట్రీకటింగ్ చేపట్టేందుకు రూ.10 వేలు, వర్షాకాలంలో మరోమారు చేపట్టేందుకు మరో రూ.10 వేలు ఇస్తోంది. ఆ నిధులతోనే అధికారులు పనిముట్లు, పనివాళ్ల కోసం, కటింగ్ చేసిన కొమ్మలు అక్కడ నుంచి తరలించేందుకు వినియోగించాల్సి ఉంటుంది. కానీ బోడుప్పల్ నగర పాలక సంస్థ పరిధిలోని కొన్ని ప్రాంతాల్లో ట్రీ కటింగ్ చేసిన కొమ్మలను తొలగించడం లేదు. వాటిని తొలగించిన చోటే రోడ్డు పక్కన పడేసి వెళ్తున్నారు. దీంతో స్థానిక ప్రజల రాకపోకలకు ఇబ్బందులు తప్పడం లేదు. అంతేగాకుండా పది రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిసి దుర్వాసన వెలువడుతోంది. ఇదే విషయమై విద్యుత్‌శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా ట్రీ కటింగ్ కోసం ప్రభుత్వం ఇచ్చే నిధులు సరిపోవడం లేదని, మున్సిపల్ అధికారుల సమన్వయంతో వాటిని తొలగిస్తామని చెబుతున్నారు.

ప్రజాధనం వృథా..

హరితహారం కోసం ప్రజాధనాన్ని ప్రభుత్వం ఖర్చు చేస్తోంది. విద్యుత్ స్తంబాల కింద ఎత్తయిన చెట్లను పెంచడం, అవి విద్యుత్ వైర్లకు అడ్డొస్తున్నాయని కొట్టేయడం జరుగుతోంది. దీంతో ప్రజాధనం వృథా అవుతోంది. విద్యుత్ అధికారులు కొన్ని ప్రాంతాల్లో ట్రీ కటింగ్ చేసిన కొమ్మలను అక్కడే పడేయడంతో స్థానికులకు ఇబ్బందులు తప్పడం లేదు. మున్సిపల్, విద్యుత్ శాఖ అధికారుల సమన్వయంతో ట్రీ కటింగ్ చేసిన చెట్ల కొమ్మలను తొలగించి ప్రజలకు ఇబ్బంది లేకుండా చూడాలి.

– ప్రమోద్‌కుమార్, బోడుప్పల్‌వాసి

రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి



మీర్‌పేట్-హెచ్‌బీ కాలనీలో ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి

ఉప్పల్: రాజకీయాలకు అతీతంగా చిలుకానగర్‌ను అభివృద్ధి చేస్తున్నామని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. మంగళవారం చిలుకానగర్ డివిజన్ పరిధిలోని రాఘవేంద్రనగర్ కాలనీలో ప్రహరీ గోడ, సీసీ రోడ్డు తదితర రూ.28 లక్షలతో చేపట్టే పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్, ఈఈ నాగేందర్, డీఈ నిఖిల్‌రెడ్డి, ఏఈ రాజకుమార్, కాలనీ అధ్యక్షుడు కౌశిక్, పోచయ్య, ఉదయ్, బీఆర్ఎస్ నేతలు వెంకటేశ్వర్‌రెడ్డి, పల్లె నర్సింగ్‌రావు, జగన్, కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో సమస్యలకు పరిష్కారం

కాప్రా: మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీలో నెలకొన్న సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి తెలిపారు. నమస్తే ఉప్పల్ కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర 21వ రోజుకు చేరింది. మంగళవారం మీర్‌పేట్ హెచ్‌బీ కాలనీ డివిజన్‌లోని ఫేజ్-2లో ప్రారంభమైన వెంకటేశ్వర్‌నగర్, హెచ్‌బీ కాలనీ ఫేజ్-1, తిరుమలనగర్, కృష్ణానగర్ కాలనీలో కొనసాగింది. ఈ సందర్భంగా స్థానికులను పలకరిస్తూ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే అన్ని సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ ప్రభుదాస్, మాజీ కార్పొరేటర్ శ్రీనివాస్‌రెడ్డి, ధన్‌పాల్‌రెడ్డి, కాసం మహిపాల్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రంగు ప్రసాద్‌గౌడ్ పాల్గొన్నారు.

సంచార వాహనం ప్రారంభం

వృద్ధుల కోసం ఉచితంగా వైద్య సేవలు అందించేందుకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాకు చెందిన ఇండియన్ రెడ్ క్రాస్ సంచార వాహనాన్ని ఉచితంగా అందించింది. ఈ వాహనాన్ని మంగళవారం ఏఎస్ రావు నగర్‌లోని సీనియర్ సిటిజన్ భవనం వద్ద ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి ప్రారంభించారు. కార్పొరేటర్ సింగిరెడ్డి శిరీషారెడ్డి, రాజేశ్వర్‌రావు, స్వర్ణలత తదితరులు పాల్గొన్నారు.



రాఘవేంద్రనగర్ కాలనీలో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

కమిషనర్ బదిలీకి బీఆర్ఎస్ నాయకులే కారణం



ఉప్పల్ డిపో వద్ద బీఆర్ఎస్ నాయకుల దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌కు రెండు నెలల క్రితం కమిషనర్‌గా వచ్చి నిజాయితీగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న కమిషనర్ వంశీకృష్ణను బీఆర్ఎస్ నాయకులు తమ అధికారాన్ని అడ్డు పెట్టుకుని బదిలీ చేయించడం హేయమని బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు సమస్యలతో కార్పొరేషన్‌కు వచ్చిన ప్రజల సమస్యలను వెంటనే పరిష్కరిస్తూ ప్రజల మన్ననలు పొందుతున్న అధికారిని బీఆర్ఎస్ నాయకుల మాట వినడం లేదని, వారు చేసే అక్రమాలకు అడ్డుపడుతున్నాడనే అక్కసుతో కమిషనర్‌ను బదిలీ చేయించారన్నారు. ఇందుకు నిరసనగా ఉప్పల్ డిపో వద్ద బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం బీఆర్ఎస్ నాయకుల దిష్టిబొమ్మను దహనం చేశారు. బీజేపీ పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ అధ్యక్షుడు నమిలికొండ అనిల్‌రెడ్డి, కూరపాటి విజకుమార్, జైపాల్‌రెడ్డి, నాయకులు గీతారాం, సుజాతానాయుడు, రాణిసుధాకర్, కరుణాకర్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, గిరిగౌడ్, రమేష్‌చారి, ఆకుల కమలాకర్, మెట్టు మహేందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, స్వరూప, కరుణాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో ఉప్పల్‌లో డిగ్రీ కళాశాలకు సొంత భవనం



ఉప్పల్ డిగ్రీ కళాశాల విద్యార్థులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుభాష్‌రెడ్డి

ఉప్పల్: త్వరలో ఉప్పల్‌లో డిగ్రీ కళాశాలకు సొంత భవనం నిర్మిస్తామని ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి అన్నారు. ప్రభుత్వ కళాశాలల్లోనే మెరుగైన విద్య అందుతుందన్నారు. మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ డా.సునీత అధ్యక్షతన నిర్వహించిన ఓరియంటేషన్ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరై విద్యార్థులతో మాట్లాడారు. తరగతి గదుల సమస్య ఉన్న మాట వాస్తవమేనని, వారంలోపే భవనాన్ని కేటాయించి సమస్యను తీర్చనున్నట్లు ఆయన తెలిపారు. త్వరలో స్థలాన్ని కేటాయించి డిగ్రీ కళాశాలకు నూతన భవనం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. విద్యార్థులు విద్యతో పాటు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి సేవలో మైనంపల్లి



మల్కాజిగిరి: మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ కార్పొరేటర్ ప్రేమ్‌కుమార్ మంగళవారం తిరుమలలో శ్రీవారిని దర్శించుకున్నారు. రెండు రాష్ట్రాల ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని కోరుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు.

దివ్యాంగ మహిళా జాతీయ సదస్సు జయప్రదం చేయండి



దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో కరపత్రం ఆవిష్కరణ

మల్కాజిగిరి: ఖమ్మంలో 5వ తేదీన జరిగే దివ్యాంగ మహిళా జాతీయ సదస్సును జయప్రదం చేయాలని జిల్లా దివ్యాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు మంగమ్మ పిలుపునిచ్చారు. మంగళవారం మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం వద్ద కార్యక్రమానికి సంబందించిన కరపత్రాలను జిల్లా అధ్యక్షుడు వినయ్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. మంగమ్మ మాట్లాడుతూ అర్హులైన దివ్యాంగులకు నూతన పింఛన్లు మంజూరు చేయాలన్నారు. 2016 దివ్యాంగుల హక్కుల చట్టాన్ని అమలు చేయాలన్నారు. జాతీయ సదస్సుకు మందక్రిష్ణ మాదిగ హాజరవుతారని, పెద్ద సంఖ్యలో పాల్గొన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సీతామహాలక్ష్మి, విజయ, పర్విన్, జ్యోతి, భవాని, దుర్గమ్మ పాల్గొన్నారు.

విచ్చలవిడిగా మద్యం, మాదకద్రవ్యాల విక్రయం



ఉప్పల్: నియోజకవర్గంలో డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాలను అరికట్టడంలో ఎక్సైజ్ శాఖ అధికారులు పూర్తిగా విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఆరోపించారు. ఉప్పల్ అసెంబ్లీ బీజేవైఎం ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభాకర్ మాట్లాడుతూ.. మద్యం, మాదకద్రవ్యాల అమ్మకాలు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయన్నారు. పారిశ్రామికవాడలు, గంజాయి కేంద్రాలుగా మారాయని, దాంతో పాటు అర్ధరాత్రి వరకు మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయని చెప్పారు. వైన్‌షాపులు పోటీపడి బస్తీల్లో బెల్టుషాపులు పెట్టి పేదల జీవితాలతో చెలగాటం ఆడుతున్నారన్నారు. కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు చల్లా ప్రభాకర్, చిలుకానగర్ డివిజన్ అధ్యక్షుడు గోనే శ్రీకాంత్, రాష్ట్ర నాయకులు సందీప్ యాదవ్, అభిషేక్‌గౌడ్, సంపత్, శ్రీనివాస్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

అర్చక స్వాముల ఆత్మీయ సమ్మేళనం



అల్వాల్: హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆర్ష విద్యా తపస్వి ఆర్ష విజ్ఞాన భాస్కర పశర్లపాటి శ్రీనివాస బంగారయ్యశర్మ అన్నారు. మంగళవారం నేరేడ్‌మెట్ డివిజన్ పరిధిలోని జేకే కాలనీ సరస్వతి ఫంక్షన్ హాల్‌లో హిందూ ధర్మ సంరక్షణ సమితి, జీకె చారిటబుల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో అర్చక పురోహితుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ప్రజ్ఞాభారతి చైర్మన్ పద్మశ్రీ అవార్డు గ్రహీత త్రిపురనేని హనుమాన్ చౌదరి, బంగారయ్యశర్మ మాట్లాడుతూ అర్చక పురోహితులను సమాజం తగిన విధంగా వారిని గౌరవించుకోవాలని అన్నారు. కార్యక్రమానికి బీజేపీ మధ్యప్రదేశ్ ఇన్‌చార్జి మురళీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో కొత్త రోడ్లు వేస్తాం



మచ్చబొల్లారంలో పర్యటిస్తున్న కార్పొరేటర్ రాజ్ జితేంద్రనాథ్, అధికారులు

అల్వాల్: మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని శ్రీసాయి కాలనీలో మంగళవారం అల్వాల్ సర్కిల్ అధికారులతో కలిసి స్థానిక కార్పొరేటర్ రాజ్‌జితేంద్రనాథ్ పర్యటించారు. ఇటీవల కురుసిన దెబ్బతిన్న రోడ్లు, అస్తవ్యస్తంగా మారిన రోడ్లను ఆయన పరిశీలించారు. ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు సహకారంతో రోడ్ల నిర్మాణానికి కృషి చేస్తానని కాలనీ వాసులకు హామీ ఇచ్చారు. డీఈ మహేష్, జలమండలి అధికారి సాంబయ్య, రమేష్, సంజీవరెడ్డి, నరేందర్‌రెడ్డి, ప్రవీణ్‌రెడ్డి, శ్రావణ్‌కుమార్, కృష్ణ, రాములు, అజయ్, నాయకులు శ్రీశైలంయాదవ్, వెంకటేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

త్వరలోనే కనీస వసతులు కల్పిస్తాం



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మహేందర్‌రెడ్డి

మేడ్చల్: నియోజకవర్గ ప్రజల సమస్యలను పరిష్కరించడంలో మంత్రి మల్లారెడ్డి మనసున్న మహారాజని బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చామకూర మహేందర్‌రెడ్డి అన్నారు. మేడ్చల్ పట్టణంలోని తుమ్మచెరువు కట్టపై నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను ఆయన మున్సిపల్ చైర్‌పర్సన్ దీపిక నర్సింహరెడ్డితో కలిసి పరిశీలించారు. గ్రామాలు, పట్టణాల్లో ఎలాంటి సమస్యలు ఎదుర్కొంటున్నా మంత్రి మల్లారెడ్డి తన సొంత నిధులతో అభివృద్ధి చేస్తున్నారని అన్నారు. సీసీ రోడ్లు, బీటీ రోడ్లు, భూగర్భ డ్రైనేజీలు, ఆలయాలు, మజీద్‌ల అభివృద్ధి, ప్రహరీ గోడల నిర్మాణం, కమ్యూనిటీ హాల్స్, కులసంఘాల ఆత్మగౌరవ భవనాలు ఇలా ఏ సమస్య ఉన్నా సొంత నిధులు వెచ్చించి నిర్మాణాలు చేస్తున్నామని అన్నారు. నియోజకవర్గ ప్రజలకు కనీస వసతులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకువచ్చేందుకు తమ కుటుంబం ద్వారా నిధులు వెచ్చిస్తున్నామని అన్నారు. స్థానిక ప్రజాప్రతినిధుల అండతో అన్ని సమస్యలను త్వరలోనే పరిష్కరిస్తామని అన్నారు. కౌన్సిలర్లు మర్రి శ్రీనివాస్‌రెడ్డి, సుహాసిని, నాయకులు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

రహదారి పనులు చేపట్టకపోవడంతో ఇబ్బందులు



రహదారిని పరిశీలిస్తున్న కార్పొరేటర్ శ్రవణ్

మల్కాజిగిరి: సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని మల్కాజిగిరి కార్పొరేటర్ శ్రవణ్ అధికారులకు సూచించారు. మంగళవారం పలు కాలనీల్లో పర్యటించారు. మల్కాజిగిరి చౌరస్తా నుంచి మజిద్ వెళ్లే రహదారిలో యూజీడీ పనులు పూర్తయినా రహదారి పనులు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులకు గురవుతున్నారని, చర్యలు తీసుకోవాలని ఏఈ శ్రీకాంత్‌కు సూచించారు. ఓల్డ్ మల్కాజిగిరి హనుమాన్ వ్యాయామశాల సమీపంలో ఉన్న ఓపెన్ నాలాను యూజీడీ పైపులైనుగా మార్చాలని జలమండలి అధికారులకు సూచించారు. రాజీవ్‌గాంధీనగర్, ఎస్పీనగర్, బాలసరస్వతీనగర్ తదితర ప్రాంతాల్లో నూతన విద్యుత్ పోల్స్ ఏర్పాటు చేయాలని ఏడీఈ యాదగిరిని కోరామన్నారు. కార్యక్రమంలో వీఐ రమేష్, ఎల్ఐ వెంకటేశ్వరరావు, బాలచందర్‌గౌడ్, సునీల్, యాకూబ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేల కుటుంబాల్లో వెలుగులు నింపిన కేసీఆర్



ఉప్పల్ డిపోలో కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మేయర్, ఆర్టీసీ సిబ్బంది

మేడిపల్లి: టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేస్తూ ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తిస్తూ సీఎం కేసీఆర్ మంత్రి మండలిలో తీసుకున్న నిర్ణయం పట్ల ఆర్టీసీ ఉద్యోగులు హర్షం వ్యక్తం చేశారు. మేయర్ జక్కా వెంకట్‌రెడ్డి, డీఎం శ్రీనివాస్‌తో కలిసి సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడంతో ఆర్టీసీ కార్మికుల కల నెరవేరిందని, వేల కుటుంబాల్లో వెలుగులు నింపారని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు సుభాష్‌నాయక్, బచ్చ రాజు, మద్ది యుగేందర్‌రెడ్డి, కొడె పోచయ్య, ఏంపల్లి అనంతరెడ్డి, దొంతిరి హరిశంకర్‌రెడ్డి, కో ఆప్షన్ మెంబర్ ఇర్ఫాన్, నాయకులు బండారి రవీందర్, బండి సతీష్ గౌడ్, ఏనుగు మనోరంజన్‌రెడ్డి, రఘువర్ధన్‌రెడ్డి, జావీద్ ఖాన్, కండక్టర్లు, డ్రైవర్లు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ హయాంలోనే మల్కాజిగిరి అభివృద్ధి



హనుమాన్‌పేటలో డీసీసీ అధ్యక్షుడు శ్రీధర్

గౌతంనగర్: కాంగ్రెస్ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు నందికంటి శ్రీధర్ అన్నారు. మంగళవారం డివిజన్ పరిధిలోని హనుమాన్‌పేట్ తదితర ప్రాంతాల్లో కాలనీ నేస్తం- కాంగ్రెస్ పార్టీ హస్తం కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి డీసీసీ అధ్యక్షులు నందికంటి శ్రీధర్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ కాంగ్రెస్ హయాంలోనే మల్కాజిగిరి నియోజకవర్గం అభివృద్ధి జరిగిందన్నారు. రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే రూ.500లకే గ్యాస్ సిలిండల్‌ను అందజేస్తామన్నారు.